సాక్షి కామారెడ్డి

శుక్రవారం ౹ 19 ౹ మే ౹ 2023



2న ఆన్‌లైన్ క్విజ్ పోటీ

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వచ్చే నెల 2న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నారు.

- 8లో ▸



పారిశుధ్యం లోపిస్తే చర్యలు

గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూసుకోవాల్సిన బాధ్యత పంచాయతీల అధికారులదేనని జెడ్పీ సీఈవో అన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
40.9 /27.5

వాతావరణం

ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మంత్రి హరీశ్‌రావును కలిసిన ప్రభుత్వ విప్



సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును గురువారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ హైదరాబాద్‌లో కలిశారు. కామారెడ్డిలో మెడికల్ కళాశాల మంజూరు చేయడంతో పాటు ఈ ఏడాది తరగతులు ప్రారంభించేందుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతులు ఇప్పించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య కళాశాలలో దేవునిపల్లి పీహెచ్‌సీ కలిసిపోతున్నందున కామారెడ్డి మండలంలోని గ్రామాల ప్రజల కోసం నర్సన్నపల్లి శివారులో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు విప్ గంప గోవర్ధన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తలమడ్ల, బస్వాపూర్, ఇసన్నపల్లి, బీబీపేట, అడ్లూర్, చిన్నమల్లారెడ్డి గ్రామాల్లో నూతన సబ్‌సెంటర్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని గంప గోవర్ధన్ తెలిపారు.

నవోదయ ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: జిల్లాలోని నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయం 2023–24కుగాను ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ప్రవేశ పరీక్ష కోసం ఈ నెల 31లోగా సంబంధిత వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవోదయలో సీబీఎస్‌ఈ సిలబస్ ఉంటుందని తెలిపారు. జూలై 22న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీఎన్జీవోస్ కేంద్ర కమిటీలో జిల్లాకు ప్రాతినిధ్యం

- కార్యదర్శిగా ఎన్నికైన ముల్కు నాగరాజు



కామారెడ్డి అర్బన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల కేంద్ర సంఘంలో కామారెడ్డి జిల్లాకు తొలిసారిగా ప్రాతినిధ్యం లభించిందని, కేంద్ర సంఘం కార్యదర్శిగా ముల్కు నాగరాజు ఎన్నికైనట్టు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, సాయిలు గురువారం తెలిపారు. కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, మారం జగదీశ్వర్‌లతో పాటు కార్యదర్శి ఎన్నికైన నాగరాజును సన్మానించినట్లు వారు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా తరపున పాల్గొని ఉద్యోగుల సమస్యలపై కేంద్ర కమిటీ ప్రతినిధులతో చర్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీకాంత్, మహిపాల్, చరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీకి ఈ నెల 22 చివరి తేది

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న ఉచిత బియ్యం పంపిణీకి ఈ నెల 22 చివరి తేదీ అని రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరిశెట్టి రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదట ఈ నెల 18వ తేది వరకు పంపిణీ ఉండగా కొన్ని గ్రామాల్లో బియ్యం ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపుల్లోకి చేరవేయడంలో ఆలస్యమైనందున ఒక రోజు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని వారు ఉంటే సంబంధిత రేషన్ షాపుల్లో బియ్యం తీసుకోవాలని ఆయన కోరారు.

4,534 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో గురువారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 4,534 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. అవసరమైన 447 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,22,861 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం ఇప్పటి వరకు 62,259 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

పొంగుతున్న పొరుగు మద్యం!

- ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మార్గాల ద్వారా దిగుమతి
- మారుమూల గ్రామాలే అడ్డాగా మద్యం నిల్వలు
- జిల్లాలో విచ్చల విడిగా అమ్మకాలు
- ఇటీవల ఎక్సైజ్ పోలీసులకు చిక్కిన ఓ ముఠా



సాక్షి, కామారెడ్డి: జిల్లాలో పొరుగు రాష్ట్రాల మద్యం పొంగుతోంది. తద్వారా రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లుతోంది. ఏళ్లుగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు పొరుగు రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం పెద్దఎత్తున తరలివస్తోంది. మారుమూల గ్రామాలే అడ్డాగా మద్యం నిల్వలు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. అప్పుడప్పుడూ ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తోంది. ఇటీవల సదాశివనగర్ మండలం కుప్రియాల్, నాగిరెడ్డిపేట మండలం ఆత్మకూర్ గ్రామాలకు చెందిన ఓ ఇద్దరిని ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించడంతో ముఠా గుట్టురట్టయ్యింది. గతంలోనూ దోమకొండ, బీబీపేట మండలాల్లో పొరుగు రాష్ట్రాల మద్యాన్ని ఎక్సైజ్ శాఖ స్వాధీనం చేసుకుంది. జిల్లా సరిహద్దు ప్రాంతంలో మహారాష్ట్ర మద్యం పెద్ద ఎత్తున తరలివస్తున్నట్లు తెలుస్తోంది. బెల్ట్‌షాపుల ద్వారా పొరుగు మద్యాన్ని విక్రయిస్తున్నారు. అంతేగాక కల్తీ మద్యం అమ్మకాలు కూడా సాగుతున్నట్లు తెలుస్తోంది.

డిఫెన్స్ క్యాంటీన్ల నుంచి..

జిల్లాలో కొందరు డిఫెన్స్ క్యాంటీన్ల నుంచి మద్యాన్ని కొనుగోలు చేసి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. సైనికులు, మాజీ సైనికుల పేర్లతో డిఫెన్స్ క్యాంటీన్ల నుంచి బ్రాండెడ్ మద్యం కొనుగోలు చేసి స్థానికంగా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. సాధారణంగా డిఫెన్స్‌లో పనిచేసిన వారికి తక్కువ ధరలకు మద్యం విక్రయిస్తారు. కొందరు వ్యక్తులు ప్రతిరోజూ క్యాంటీన్లకు వెళ్లి వివిధ బ్రాండ్ మద్యం బాటిళ్లను కొనుగోలు చేసుకుని వచ్చి తమ కస్టమర్లకు అమ్ముకుంటారని తెలుస్తోంది.

కల్తీ మద్యం కూడా..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కల్తీ మద్యం ఆనవాళ్లు అప్పుడప్పుడు బయటపడుతున్నా ఆబ్కారీ శాఖ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కల్తీ మద్యం ఏదో ఒక రూపంలో దూసుకువస్తోంది. ముఖ్యంగా బెల్ట్ షాపుల్లో కల్తీ మద్యం అమ్మకాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. మద్యం అమ్మకాలను పెంచడంపై ఎక్సైజ్ అధికారులు మద్యం వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారే తప్ప, పొరుగు మద్యంతో పాటు కల్తీ మద్యం అమ్మకాలపై దృష్టి సారించడం లేదు. వీటిని కట్టడి చేస్తే మన మద్యం అమ్మకాలు మరింత పెరగవచ్చు.

అక్రమ మార్గాల ద్వారా..

పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మార్గాల ద్వారా మద్యం తరలివస్తోంది. ఇటీవల ఎక్సైజ్ శాఖకు పట్టుబడిన మద్యం హర్యానాతో పాటు గోవా రాష్ట్రాలకు చెందినదిగా గుర్తించారు. గతంలోనూ హర్యానా మద్యం పట్టుబడింది. మద్యం మాఫియా అక్రమ మార్గాలను ఎంచుకుని పెద్ద ఎత్తున పొరుగు రాష్ట్రాల నుంచి మద్యాన్ని తీసుకువచ్చి దందా నడిపిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కొందరు మద్యం వ్యాపారులు ఎక్కువ మార్జిన్ కోసం పొరుగు రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి రాష్ట్రానికి చెందిన మద్యంతో కలిపి విక్రయిస్తున్నట్లు సమాచారం. చాలాచోట్ల బెల్ట్ షాపుల్లో పొరుగు రాష్ట్రాల మద్యం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా వ్యాపారులతో చేతులు కలిపి మద్యం మాఫియా పొరుగు రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి దర్జాగా దందా నడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి.



ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న పొరుగు రాష్ట్రాల మద్యం బాటిళ్లు(ఫైల్)

ఉనికిలో లేని టాస్క్‌ఫోర్స్ బృందాలు

గతంలో ఎక్సైజ్ శాఖలో టాస్క్‌ఫోర్స్ బృందాలు కీలకంగా పనిచేసేవి. అయితే ఈ మధ్యకాలంలో వాటి ఉనికి లేకుండాపోయింది. పొరుగు మద్యం, కల్తీ మద్యం విషయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా ఉంచి, సమాచారం దొరికితే చాలు దాడులు నిర్వహించేవారు. వీటితో పాటు గంజాయి, క్లోరోఫాం, డైజోఫాం వంటి మత్తు పదార్థాల అక్రమ దందాను కట్టడి చేయడంపై టాస్క్‌ఫోర్స్ కీలకంగా పనిచేసేది. పొరుగు మద్యంతో పాటు కల్తీ మద్యం, గంజాయి, మత్తు పదార్థాల కట్టడికి ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

ఎండలతో ఉక్కిరిబిక్కిరి..!

- జిల్లాలో అత్యధికంగా 42.3 డిగ్రీలు నమోదు



సాక్షి, కామారెడ్డి: జిల్లాలో ఎండల తీవ్రత తగ్గకపోగా క్రమేపీ పెరుగుతోంది. అకాల వర్షాలతో పక్షం రోజుల పాటు వాతావరణం చల్లబడి ఊపిరిపీల్చుకున్న జనం ఒక్కసారిగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల తో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లాలో గురువారం అత్యధికంగా ఎల్లారెడ్డి మండలం మాచాపూర్‌లో 42.3 డిగ్రీలు నమోదైంది. బాన్సువాడ మండలం కొల్లూర్‌లో 42.1 డిగ్రీలు, నిజాంసాగర్ మండలం హసన్‌పల్లిలో 42 డిగ్రీలు, డోంగ్లీలో 41.9, భిక్కనూరులో 41.8, సర్వాపూర్, బీర్కూర్‌లలో 41.4, ముగ్దుంపూర్‌లో 41.1, మేనూర్‌లో 41 డిగ్రీలు, రా మారెడ్డిలో 40.9 డిగ్రీలు, జుక్కల్‌లో 40.3 డిగ్రీలు, లింగంపేటలో 40.2, పిట్లంలో 40.1 డిగ్రీలు, నాగిరెడ్డిపేటలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో 38 డిగ్రీల నుంచి 40డిగ్రీల వరకు నమోదయ్యాయి. ఎండల తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు, కూలీలు అ స్వస్థతకు గురవుతున్నారు. వరి ధాన్యం, మక్కలను నూర్పిడి చేసి, బస్తాల్లో నింపే సందర్భంలో రైతులు ఎండలను తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు.

బీర్లు తెగ తాగేస్తున్నారు..

- ఈనెల 17వ తేదీ వరకు రూ. 27 కోట్ల అమ్మకాలు
- ఎక్సైజ్ శాఖకు రోజుకు రూ. 1.58 కోట్ల ఆదాయం

ఖలీల్‌వాడి : భానుడి భగభగల కారణంగా మందుబాబులు దాహార్తిని తీర్చుకునేందుకు చల్లటి బీర్లను ఆశ్రయిస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో వేసవి ప్రారంభం నుంచే బీర్లకు విపరీతమైన గిరాకీ పెరిగింది. దీంతో మే నెల 1 నుంచి 17 వరకు ఒక్కరోజుకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రూ. 1.58 కోట్లు బీర్ల ద్వారా ఎక్సైజ్ శాఖకు ఆదాయం సమకూరుతుంది. నిజామాబాద్ జిల్లా లో 102 వైన్స్‌లు, 20 బార్లు ఉండగా, కామారెడ్డి జిల్లాలో 49 వైన్స్‌లు, 8 బార్లు ఉన్నాయి. ఈ వైన్స్‌లకు నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాదాపూర్‌లోని ఐఎంఎల్ డిపో నుంచి మద్యం తరలిస్తారు. వేసవి కావడంతో ఇతర మద్యం కంటే ఎక్కువగా బీర్ల అమ్మకాలు జరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఐఎంఎల్ పాయింట్ నుంచి రోజు రూ. 7 కోట్ల నుంచి రూ. 8 కోట్ల మద్యాన్ని ఉమ్మడి జిల్లాలోని మద్యం వ్యాపారులు తీసుకెళ్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం 15 రోజుల నుంచి వర్షాలు లేకపోవడం ఎండలు తీవ్రంగా ఉండడంతో బీర్ల ఎక్కువగా అమ్మకాలు జరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. కేవలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రతి నెలా అన్ని రకాల మద్యానికి సంబంధంచి రూ. 160 కోట్లకు పైగా ఎక్సైజ్ శాఖకు ఆదాయం సమకూరుతుంది.

మూడునెలలుగా ఉమ్మడి జిల్లాలో బీర్ల అమ్మకాలివి..

నెల	బీర్ల అమ్మకాలు(కేసులు)	ఆదాయం(రూ. కోట్లలో)
మార్చి	2.75 లక్షలు	46
ఏప్రిల్	2.25 లక్షలు	38
మే (17వ తేదీ)	1.64 లక్షలు	27

రెండు నెలల 17 రోజుల్లో ఆదాయం రూ. 111 కోట్లు

తెయూలో పీజీ తరగతులు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీలో పీజీ తరగతులు గురువారం పునఃప్రారంభమయ్యాయి. మూడు క్యాంపస్‌లకు సంబంధించిన రెగ్యులర్ అధ్యాపకులు, కాంట్రాక్ట్ అధ్యాపకులతో బుధవారం వీసీ రవీందర్‌గుప్తా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 30 వరకు ప్రకటించిన వేసవి సెలవులను రద్దు చేసి తరగతులు ప్రారంభించాలని నిర్ణయించారు. వీసీ ఆదేశాల మేరకు గురువారం పలు విభాగాల అధ్యాపకులు కళాశాలలకు హాజరయ్యారు. అయితే రిజిస్ట్రార్‌గా ఎవరూ లేకపోవడంతో తరగతులు పునఃప్రారంభించినట్లు సర్క్యులర్ జారీ చేయలేదు.

ఎనిమిది రాష్ట్రాల ప్రతినిధుల బృందం పర్యటన

డ్వాక్రా సంఘాల పనితీరుపై అధ్యయనం



సంఘాల పనితీరును వివరిస్తున్న డీపీఎం

దోమకొండ: డ్వాక్రా సంఘాల పనితీరుపై అధ్యయనం చేయడానికి గురువారం ఎనిమిది రాష్ట్రాల ప్రతినిధులు బృందం మండలంలోని ముత్యంపేట, సంఘమేశ్వర్ గ్రామాల్లో పర్యటించారు. మండల సమాఖ్యల పనితీరు ను పరిశీలించడానికి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, డెహ్రాడూన్, బీహార్, మధ్యప్రదేశ్, గుజ రాత్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి ఎన్జీవోల ప్రతినిధుల బృందం పర్యటించారు. ఆయా రాష్ట్రాలకు చెందిన 21 మంది ఎన్జీవోల ప్రతినిధులు రెండు గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల సంఘాల సభ్యులతో మాట్లాడారు. వీరు సంఘాల్లో జరుగుతున్న ఆర్థిక లావా దేవీలు, బ్యాంకు రుణాలు, చెల్లింపులు, పుస్తక నిర్వహణ, సంఘాల్లో సభ్యుల సంఖ్య, వారి పొదుపు వివరాలు, తదితర విషయాలపై మాట్లాడి సంఘ సభ్యుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలు డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యారన్నారు. తమ రాష్ట్రాల్లో ఈ విధానం అమలు చేయడానికి ఏపీ మాస్ ద్వారా ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా వారు విలేకరులతో తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, ఏపీ మాస్ శ్రీనివాస్, ఏపీఎం రాజు, డీఎంజీ రాము, సీసీలు రాజేశం, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

బ్యాంకర్లు లక్ష్యాలను చేరుకోవాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



ప్రణాళిక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: జిల్లాలోని పాడి, మత్స్య పరిశ్రమలకు లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలను అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం 2023 మార్చి త్రైమాసిక బ్యాంకుల రుణ వితరణ, పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యా రుణాలను ఇవ్వడానికి బ్యాంకర్లు జిల్లా కేంద్రంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో స్టాల్లు ఏర్పాటు చేసి యువతకు అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ. 665 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వడానికి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలో 8,000 ఎకరాల్లో ఆయిల్ పాం సాగు చేయడానికి బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరడానికి బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న రుణాలను సత్వరమే అందించాలన్నారు. ఈ సందర్భంగా 2023–24 బ్యాంకుల వార్షిక ప్రణాళిక కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్లు అంబరీష్, నవీన్, ఎల్‌డీవోలు అనిల్, ప్రసాద్, ఎల్‌డీఎంలు చిందం రమేశ్, భార్గవ్ సుధీర్, వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి



బదిలీపై వెళ్తున్న ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎస్పీ

కామారెడ్డి క్రైం: నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారీ సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసుల విచారణ వేగవంతంగా పూర్తిచేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. శిక్షల రేటు (కన్విక్షన్) పెంచడం ద్వారా నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందన్నారు. వేసవికాలం కాబట్టి ప్రజలు చాలామంది చల్లదనం కోసం ఇంటి బయట, బంగ్లాలపై నిద్ర పోతుంటారన్నారు. తద్వారా ఇళ్లలో దొంగలు పడే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం హైదరాబాద్ విజిలెన్స్ విభాగానికి బదిలీపై వెళ్తున్న ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావును సత్కరించారు. సమావేశంలో ఏఎస్పీ అన్యోన్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అక్రమాలు ‘ఓపెన్’ కావద్దని..!

- ఓపెన్ పరీక్షల అక్రమాలపై విచారణేదీ..!
- ఎంక్వయిరీకి ఇద్దరు ఎంఈవోల నియామకం
- పది రోజులైనా విచారణ చేపట్టని అధికారులు
- అక్రమాలు భయటపడొద్దనే జాప్యం?
- విద్యాశాఖ మంత్రి ఆదేశించినా పట్టించుకోని వైనం



మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు(ఫైల్)

కామారెడ్డి టౌన్: జిల్లాలో గత నెల జరిగిన ఇంటర్, ఎస్సెస్సీ ఓపెన్ పరీక్షల్లో విద్యార్థుల నుంచి మాస్ కాపీయింగ్ కోసం సుమారు రూ. 2కోట్లకు పైగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఘటపై విచారణ చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. పరీక్షలు జరుగుతున్న సమయంలో రాష్ట్ర అబ్జర్వర్ తనిఖీల్లో మాస్ కాపీయింగ్ పాల్పడుతుండగా.. ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాస్తుండగా.. ఇలా 8 మందిని పట్టుకోగా వారిపై కేసులు కూడా నమోదు చేశారు. విద్యార్థి సంఘాలు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఆమె విచారణకు ఆదేశించారు. మంత్రి ఆదేశించినా ఇప్పటి వరకు విచారణ చేపట్టడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. విచారణ కోసం కమిటీని నియమించినా ఇప్పటికీ ఎంక్వయిరీ మొదలుకాలేదు. పూర్తిగా సాక్ష్యాలు ఉండడం, యూపీఐ ఆన్‌లైన్ లావాదేవీలు ఉండడంతో విచారణ జరిపితే ఎక్కడ అవినీతి బయటపడుతుందనే ఉద్దేశంతో కాలయాపన చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్ని సాక్ష్యాలున్నా..

జిల్లాలో గత నెల ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షల్లో 2వేలకు పైగా విద్యార్థులు 11 కేంద్రాల్లో పరీక్షలు రాశారు. అయితే ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాయడానికి రూ. 20వేలు, మాస్ కాపీయింగ్‌కు రూ. 10వేల వరకు ఒక్కో విద్యార్థి నుంచి డబ్బులు వసూలు చేశారని స్వయంగా కొందరు విద్యార్థులు చెప్పారు. దీనికి సంబంధించి పరీక్షా కేంద్రాల వద్ద డబ్బులు తీసుకుంటున్నట్లు వీడియోలు బయటకు వచ్చాయి. కామారెడ్డిలోని హరిజన వాడలోని పరీక్షా కేంద్రంలో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ నలుగురు, దేవునిపల్లి హైస్కూల్‌లో ఒకరు ఇలా పట్టుబడ్డారు. 8 మందిపై కేసులు నమోదయ్యాయి. హరిజనవాడలోని గర్ల్స్ హైస్కూల్‌లో ఓ టీచర్ స్వయంగా బోర్డుపైనే సమాధానాలు రాసి విద్యార్థులకు చెప్పినట్లు, అన్నిసెంటర్లలో మాస్ కాపీయింగ్ జరిగినట్లు ఆరోపణలున్నాయి.

జిల్లా కో-ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జి, డీవోలు, సీఎస్‌లు, ఇన్విజిలేటర్లు, పలువురు ప్రధాన ఉపాధ్యాయ సంఘాల నేతలు, డీఈవో ఇలా అందరూ కలిసి రూ. రెండు కోట్లకు పైగా డబ్బులు వసూలు చేసి పంపకాలు చేసుకున్నట్లు తెలిసింది. ప్రధానంగా కొందరు విద్యార్థులు డబ్బులను ఆన్‌లైన్ ద్వారా పరీక్షల నిర్వహణ అధికారులు డబ్బులు పంపారు.

పట్టించుకోని విచారణ అధికారులు

జిల్లాలో జరిగిన అక్రమాలకు విద్యార్థి సంఘాల నేతలు తీవ్రంగానే ఆందోళనలు చేశారు. ఈనెల 9న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి స్పందించి విచారణ చేయాలని ఆదేశించింది. అంతకు ముందు ఏసీబీ, కలెక్టర్, ఎస్పీలకు సైతం ఫిర్యాదులు అందాయి. దీంతో ఎల్లారెడ్డి, సదాశివనగర్ ఎంఈవోలను విచారణ అధికారులుగా నియమించారు. ఇప్పటికి 10 రోజులు అవుతున్నా విచారణ జరపడం లేదు. ఒక్క అడుగు ముందుకు పడలేదు. కాలయాపన చేస్తే అక్రమాలు మరిచిపోతారనే ఉద్దేశంతో విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మరో వైపు ఓ ముగ్గురు ఉపాధ్యాయ సంఘాల నేతలు పలువురు విద్యార్థి సంఘాల నాయకులకు భారీగానే ముడుపులు ఇచ్చి నోరు మూయించారని తెలిసింది. దీంతో మరి కొందరు విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. దీంతో వారిని కూడా కొందరు విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు బుజ్జగిస్తున్నట్లు చేస్తున్నట్లు తెలిసింది.

యూపీఐ లావాదేవీలు పరిశీలిస్తే గుట్టురట్టు

ప్రధానంగా ఓపెన్ పరీక్షల అక్రమాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్న సీఎస్, డీవో, ఇన్విజిలేటర్ల యూపీఐ లావాదేవీలను విచారణ చేస్తే అక్రమాలు బయటపడతాయనే ఉద్దేశంతో ఇద్దరు విచారణ అధికారులు ఎంక్వయిరీ చేయకుండా అడ్డుకుంటున్నట్లు తెలిసింది. విచారణ జరిగితే విద్యాశాఖలోని ఉన్నతాధికారులతో పాటు 15 మంది సస్పెండ్ అయ్యే అవకాశాలున్నాయి. మరోవైపు కేసులు నమోదైనా వారిపై కూడా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఒకవేళ తమపై చర్యలు తీసుకుంటే స్వయంగా అక్రమాలు బయటపెడతామని కేసులు నమోదైన వారు విద్యాశాఖ అధికారులకు చెప్పడంతో విచారణ జరగకుండా అడ్డుకుంటున్నట్లు తెలిసింది.

❝ విచారణ చేపట్టాలని ఆదేశించాం

ఓపెన్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో విచారణ కమిటీ వేసి ఎంక్వయిరీ చేయాలని ఆదేశించాం. ఇద్దరు ఎంఈవోలు విచారణ కమిటీలో ఉన్నారు. మరి ఇప్పటి వరకు వారు విచారణ చేశారో లేదో నాకు తెలియదు. తక్షణమే విచారణ చేయాలని చెబుతాం. – ఎస్.రాజు, డీఈవో, కామారెడ్డి

క్లుప్తంగా

ఉపాధి హామీ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటించాలి



కామారెడ్డి రూరల్: రాష్ట్రంలో ఉపాధిహామీ చట్టంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికి పే స్కేల్ ప్రకటించాలని ఉపాధిహామీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు జేఏసీ చైర్మన్ లింగయ్య తెలిపారు. కేబినెట్ మీటింగ్‌లో ఉపాధిహామీ ఉద్యోగుల గురించి మాట్లాడి పేస్కేలు వచ్చేలా చూడమని కోరినట్లు తెలిపారు. వెంకట్‌రాంరెడ్డి, విజయ్, అంజిరెడ్డి, కృష్ణాగౌడ్, మోహన్‌రావు, వెంకటేష్‌గౌడ్, రమేష్, రాజేశ్వర్, సాంబాజీ, రాజేశ్వర్‌గౌడ్, ప్రసాద్, రాజశేఖర్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం శనివారం (20న) జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వన్ కార్డు బిజినెస్ సొల్యూషన్స్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ మేనేజర్, టీం లీడర్ ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 6305743423, 9581768413, 9959456793 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాలికను వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు

మోపాల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (15)ను వివాహం చేసుకున్న జక్రాన్‌పల్లి మండలానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మే 12న సదరు వ్యక్తి బాల్కొండ మండలంలోని శివాలయంలో పెళ్లి చేసుకున్నాడు. ఆయనకు తల్లిదండ్రులు సహకరించారు. పెళ్లి జరిగిన విషయం ఫిర్యాదు రావడంతో ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో నిజాన్ని ఒప్పుకోవడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జకీరా బేగం ఫిర్యాదు మేరకు ఆయనపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలికను సఖి కేంద్రానికి తరలించామని, హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ కళాశాలలో చదివిస్తామని ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు

లింగంపేట: మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామానికి చెందిన కుమ్మరి చందు ఉపాధి పనులు చేస్తుండగా గురువారం పాము కాటు వేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కూలీలు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గుంతలు తవ్వుతుండగా చందును పాము కరిచింది. సదరు కూలీని వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడు.

పర్యాటకులకు రక్షణ కరువు!

- ఎస్సారెస్పీ వద్ద ఏటా పలువురి మృత్యువాత
- లోతు తెలియక నీటిలో మునిగిపోతున్న వైనం



ఎస్సారెస్పీ దిగువన బుధవారం ఇద్దరు మృతి చెందిన ప్రదేశం

బాల్కొండ: శ్రీరాంసాగర ప్రాజెక్ట్ వద్ద పర్యాటకులకు భద్రత కరువైంది. దీంతో ప్రాజెక్ట్ వద్ద పర్యాటకులు ప్రమాదపు అంచునకు వెళ్లి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ప్రాజెక్ట్ వద్ద కనీస సమాచారం ఇవ్వడానికి ఎవరు లేక పోవడంతో ప్రాజెక్ట్ లోపలికి వెళ్లి, దిగువన గోదావరిలోకి వెళ్లి నీట ముని గిపోతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సందర్శనకు ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వచ్చినప్పుడు అధికంగా వస్తారు. సెలవు రోజుల్లో, పండుగ సమయాల్లో ప్రాజెక్టకు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. బుధవారం ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు నీట మునిగి ప్రాణాలు పొగుట్టుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ తగ్గడంతో లోపలికి వెళ్లే అవకాశం ఉంది. పర్యాటకులు ప్రాజెక్ట్ లోపలి నుంచి నీటి అంచునకు వెళ్లి, ఈతకు దిగి నీట మునుగుతున్నారు. అంతే కాకుండా దిగువన గోదావరిలోకి వచ్చి సెల్ఫీలు దిగుతు నీటిలో పడిపోతున్నారు. గతేడాది జగిత్యాల్ జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు ప్రాజెక్ట్‌లో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారు. తాజాగా నిర్మల్‌కు చెందిన ఇద్దరు మృతి చెందారు. ఇలా ప్రతి సంవత్సరం సగటున మూడు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాది ప్రమాదం జరగడంతో ప్రాజెక్ట్ లోపలికి వాహనాలు వెళ్లకుండా ముప్కాల్ శివారులో కదంకం తవ్వారు. అయినా వరద కాలువ వద్ద నుంచి లోపలికి వెళ్తున్నారు.

ఏటా ప్రమాదాలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి నీట మునిగి ఏటా కనీసం నలుగురు మత్యువాత పడుతున్నారు. స రాదగా ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చి ఈత కోసం, సెల్ఫీల కోసం అంటు లోపలికి వెళ్లి నీట మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా ప్రాజెక్ట్ వద్ద పర్యాటకుల కోసం ఎలాంటి రక్షణ చేపట్టడం లేదు. ప్రాజెక్ట్ వద్ద ఒక గైడ్ లేడు, రక్షణ సిబ్బంది లేరు. ప్రాజెక్ట్ వద్ద గతంలో సబ్ కంట్రోల్ బూత్ ఉండేది. దీంతో కొంత మేరా పర్యాటకులకు భద్రత ఉండేది. ఐదేళ్ల క్రితం సబ్ కంట్రోల్ బూత్‌ను ఎత్తివేశారు. ప్రాజెక్ట్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో వారు పర్యాటకుల భద్రత గురించి పట్టించుకోవడమే మానేశారు. ఉన్నత అధికారులు స్పందించి పర్యాటకులకు భద్రత కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

క్రమబద్ధీకరణ కలేనా!

- వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగులకు అందని ఉత్తర్వులు
- 2007కు ముందు చేరిన వారినే రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ప్రచారం

మోర్తాడ్: కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు సీఎం చంద్రశేఖర్‌రావు చేసిన ప్రకటన అందరు ఉద్యోగులకు వర్తించడం లేదు. ప్రధానంగా వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగుల్లో కొందరికే క్రమబద్ధీకరణ వర్తించనుండగా అనేక మంది పాత పద్ధతిలోనే ఉద్యోగంలో కొనసాగనున్నారు. ఫలితంగా క్రమబద్ధీకరణ కల నెరవేరక ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో 450 మంది పని చేస్తున్నారు. 2022లో ప్రభుత్వం రెగ్యులరైజ్ అంశంపై చేసిన ప్రకటనతో 101 మంది మాత్రమే రెగ్యులరైజ్ అవుతారని తేలింది. ఏప్రిల్ 30న రాష్ట్ర సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఫైల్‌పై సీఎం కేసీఆర్ తొలి సంతకం చేసిన విషయం విదితమే. మొదట్లో 11,500 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించగా ఉత్తర్వుల ప్రకారం 5,544 మందికే క్రమబద్ధీకరణ వర్తించింది. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు కరోనా కల్లోల సమయంలో విశిష్టమైన సేవలు అందించారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణలో మొదటి ప్రాధాన్యత వైద్య ఆరోగ్య శాఖకే ఉంటుందని అందరు భావించారు. ప్రభుత్వం మాత్రం భిన్నమైన నిర్ణయం తీసుకోవడంతో వైద్య ఆరోగ్య శాఖలో కొందరినే రెగ్యులరైజ్ చేసి అనేక మందిని పాత పద్ధతిలోనే కొనసాగించే పరిస్థితి కనిపిస్తుంది. మల్టి పర్పస్ హెల్త్ అసిస్టెంట్(మేల్), స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు రెగ్యులరైజ్ అవుతారు. 101 మందికి కేవలం 75 మందికే ఉత్తర్వులు అందే అవకాశం కనిపిస్తుంది. ఆయుష్ కింద యునానీ ఆస్పత్రుల్లో పని చేస్తున్న వారిని నిరాశే ఎదురైంది. క్షయ వ్యాధి నిర్మూలన ప్రాజెక్టులో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి నిబంధనలు అడ్డు వస్తున్నాయని ప్రభుత్వం చెబుతుంది. వైద్య ఆరోగ్య శాఖలో పలు విభాగాలను కేంద్ర, వరల్డ్ బ్యాంక్ పథకాల కింద నిర్వహిస్తుండటంతో ఈ విభాగాల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం లేదు.

వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిన నియమితులైన వారు జిల్లా సెలక్షన్ కమిటీ(డీఎస్సీ) ద్వారా ఎంపికయ్యారు. ఉద్యోగ అర్హత పరీక్ష రాయడంతో పాటు మౌఖిక పరీక్షను ఎదుర్కొని ఉద్యోగంలో చేరారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకుల నియామకంలో ఎలాంటి రాత, మౌఖిక పరీక్షను నిర్వహించకుండానే కేవలం సర్టిఫికెట్‌ల పరిశీలనతో పోస్టింగ్‌లు ఇచ్చారు. క్రమబద్ధీకరణ అంశానికి వచ్చే సరికి జూనియర్ అధ్యాపకులు గెజిటెడ్ హోదాను దక్కించుకున్నారు. డిగ్రీ అధ్యాపకులు అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో ఉత్తర్వులను అందుకున్నారు. పరీక్షలు పాసై నియమించబడినవారి పట్ల ప్రభుత్వం దయ చూపకపోవడం, సర్టిఫికెట్‌ల పరిశీలనతో ఎంపికైన వారి పట్ల సానుకూలంగా వ్యవహరించడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతుంది.

అందరినీ రెగ్యులరైజ్ చేయాలి

వైద్య ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించిన విషయాన్ని అప్పుడే మర్చిపోతే ఎలా. ప్రభుత్వం వైద్య ఉద్యోగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.

– నాంపల్లి అశోక్, కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

11వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతిలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రతి సంవత్సరం 6, 9వ తరగతుల్లో ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తుండగా, ప్రస్తుత 2023 –24 విద్యా సంవత్సరంలో నూతనంగా 11వ తరగతిలో ప్రవేశాల కోసం జవహర్ నవోదయ విద్యా సమితి నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. ఈమేరకు గురువారం నిజాంసాగర్‌లోని నవోదయ విద్యాలయం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్ గణపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి 11వ తరగతి ప్రవేశాల నోటిఫికేషన్ గురించి ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ, గ్రామీణ ప్రాంత ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇది ఎంతో చక్కటి అవకాశమన్నారు. నాణ్యమైన విద్య అందిస్తున్న నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతిలో ప్రవేశాలు పొందే అవకాశాన్ని అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 31వ తేదీలోపు www. navodaya. gov. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. జూలై 22న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

ప్రశాంతంగా ఎడ్‌సెట్

తెయూ(డిచ్‌పల్లి): జిల్లాలో గురువారం ఎడ్‌సెట్– 2023 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఎం అరుణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్ నిజామాబాద్‌లోని నాలెడ్జ్ పార్క్ స్కూల్ (అర్సపల్లి), కాకతీయ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీ (మాణిక్‌భండార్), క్షత్రియ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (ఆర్మూర్)లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. సీబీటీ పద్ధతిలో జరిగిన ఈ పరీక్ష అన్ని కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసిందని కంట్రోలర్ అరుణ తెలిపారు.

2న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీ





కామారెడ్డిలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్, నిజామాబాద్‌లో డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 2న హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొలిపే దిశగా రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 16 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న యువత జూన్1 లోపు 7661899899కు మిస్డ్ కాల్ ఇచ్చి దరఖాస్తు ఫారం పొందవచ్చన్నారు. దరఖాస్తును పూర్తి చేసి ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలన్నారు. దేశ చరిత్ర, స్వాతంత్ర్యం, తెలంగాణ ఉద్యమం అంశాలపై 60 ప్రశ్నలకు 60 నిమిషాల వ్యవధి ఉంటుందన్నారు. ఈ పోటీలో విజేతలకు ప్రతి నియోజకవర్గానికి మొదటి బహుమతిగా ల్యాప్‌టాప్, రెండో బహుమతి స్మార్ట్ ఫోన్, మూడో బహుమతి ట్యాబ్ అందజేస్తమన్నారు. అలాగే స్మార్ట్ వాచీలు, ఇయర్ ప్యాడ్లు, హార్డ్ డ్రైవ్‌లు, పవర్ బ్యాంకులు పది చొప్పున ఇస్తామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా టాపర్‌కు ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పండ్ల రాజు, గుడుగుల శ్రీనివాస్, గంగాధర్ తదితరులున్నారు.

యువతను సమాయత్తం చేయాలి

ఖలీల్‌వాడి: రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ యూత్ క్విజ్ పోటీలకు యువతను సమాయత్తం చేయాలని డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో యువజన కాంగ్రెస్ నేతలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎక్కువ మంది రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చూడాలన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, విక్కీ యాదవ్, వేణురాజ్, రవీందర్‌రెడ్డి, ప్రీతం, శశి, ప్రవీణ్, దిగంబర్, వరుణ్, అష్రఫ్, నిఖిల్ పాల్గొన్నారు.

తరుగు పేరుతో దోపిడీని నిలువరించాలి



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

సుభాష్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా రైస్‌మిల్లర్లు, ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారని, వెంటనే కడ్తా దోపిడీని నిలువరించాలని కాంగ్రెస్ కిసాన్ ఖేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి డిమాండ్‌చేశారు. ఈమేరకు గురువారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి తరుగు దోపిడీ, కొనుగోళ్లలో జాప్యం, తదితర అంశాలపై చర్చించారు. పలు ఆధారాలతో సహా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కోతలు ప్రారంభమై 2 నెలలు గడుస్తున్నా కొనుగోళ్లు ఇంకా పూర్తి కాలేదని, గన్నీబ్యాగులు, లారీల సమస్య అధికంగా ఉందని తెలిపారు. రైతులు గత్యంతరం లేక ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరకు సరుకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు ధాన్యం మొలకలు రావడం, రంగు మారడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇదే అదనుగా క్వింటాలుకు 8 నుంచి 10 కిలోల వరకు తరుగు తీస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టెక్ బీ–హెచ్‌సీఎల్ ఎర్లీ కెరీర్ ప్రోగ్రాంలో చేరాలి

సుభాష్‌నగర్: టెక్ బీ– హెచ్‌సీఎల్ ఎర్లీ కెరీర్ ప్రోగ్రాంలో చేరి, నేర్చుకుంటూనే ఉపాధి అవకాశం పొందాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో సూచించారు. ఇంటర్ పూర్తి చేసి టెక్నాలజీని కెరీర్‌గా ఎంచుకోవాలని, ఉపాధి కోరుకునే వారికి ఇది సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. 2022, 2023 ఇంటర్మీడియట్ బోర్డు పరీక్ష ఉత్తీర్ణులై, 75శాతం ఓవరాల్, 60శాతం గణితంలో మార్కులు పొందిన వారు దీనికి అర్హులన్నారు. సాఫ్ట్‌వేర్ డెవలపర్, అనలిస్టు, డిజైన్ ఇంజినీర్, డేటా ఇంజినీర్, సపోర్ట్–ప్రాసెస్ అసోసియేట్ తదితర ఉద్యోగాలు ఉంటాయన్నారు. టెక్ బీ ప్రోగ్రాంలో చేరిన విద్యార్థులకు శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత హెచ్‌సీఎల్ కంపెనీలో ఫుల్‌టైం ఉద్యోగులుగా నియమిస్తారని తెలిపారు. ప్రోగ్రాంలో భాగంగా క్లాస్ రూమ్ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్ ఉంటాయని, రూ.10,000 స్టైఫండ్ ఇస్తారన్నారు. సంవత్సరం శిక్షణకయ్యే రూ.1.10 లక్షల ఫీజు ఎడ్యుకేషనల్ లోన్ ద్వారా చెల్లించే వెసులుబాటు హెచ్‌సీఎల్ కల్పిస్తుందన్నారు. ప్రోగ్రామ్‌లో జాయిన్ అయ్యేందుకు ఈనెల 23న సెలక్షన్ డ్రైవ్‌ను హెచ్‌సీఎల్ కంపెనీ ద్వారా నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు https://bit.ly/HCLTB-Telangana లింక్ ద్వా రా రిజిస్టర్ చేసుకొని పాత అంబేడ్కర్ భవన్‌లో జరిగే డ్రైవ్‌కు హాజరుకావాలని సూచించారు. హాజరయ్యే వారు ఆండ్రాయిడ్ మొబైల్‌తో పాటు ఎస్సెస్సీ, ఆధార్‌కార్డు, ఇంటర్మీడియేట్ ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకుని రావాలని తెలిపారు. వివరాలకు 9493553821, 8074065803 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



లింగంపేటలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాసరావు

ఎల్లారెడ్డి: పారిశుధ్య వారోత్సవాల సందర్భంగా ఎల్లారెడ్డి మండలంలో జరుగుతున్న పనులను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మండలంలోని లక్ష్మాపూర్‌లో జరుగుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ పనులను పకడ్బందీగా చేపట్టి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. పనుల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూ చించారు. ఆయన వెంట ఎంపీవో ప్రకాష్, సర్పంచ్ రవీందర్‌గౌడ్, కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

లింగంపేట: పారిశుధ్య వారోత్సవాలు 23వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. మురికి నీరు కాల్వల్లో నీరు నిల్వ ఉంటే దోమల బెడద పెరిగిపోయి ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సురేందర్, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీవో ప్రభాకరచారి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు ఢీకొని మహిళ మృతి

ఖలీల్‌వాడి: ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో రైలు ఢీకొని మహిళ మృతి చెందగా, మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. రైల్వే ఎస్సై ప్రణయ్ తెలిపిన వివరాలు.. నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన బొబ్బిలి లక్ష్మీబాయి, శాంతాబాయితో కలిసి బుధవారం ధర్మాబాద్‌లో పొడి కారం కొనడానికి వెళ్లింది. కారం కొని ధర్మాబాద్ నుంచి నిజామాబాద్ వచ్చేటప్పుడు నిజామాబాద్ వచ్చామని భావించి ఇద్దరు మహిళలు జాన్కంపేట్ వద్ద దిగినట్లు తెలుస్తోందన్నారు. రైలు దిగి పట్టాలు దాటుతుండగా ఎదురుగా వస్తున్న రైలు ఢీకొనడంతో లక్ష్మీబాయి(48) అక్కడిక్కడే మృతి చెందగా శాంతాబాయి(80)కి తీవ్రగాయాలు కావడంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో మూడు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి కామారెడ్డి కోర్టు 3 రోజుల జైలు శిక్ష విధించింది. ఈ నెల 17న దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా భిక్కనూర్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన రాందాస్ చంద్రశేఖర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరుపర్చగా ద్వితీయశ్రేణి కోర్టు న్యాయమూర్తి ప్రతాప్ మూడు రోజుల జైలు శిక్ష రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్ గురువారం తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : ఐదుగురికి గాయాలు



గాంధారిలో బోల్తా పడ్డ ట్రాక్టర్

గాంధారి: గాంధారి సమీపంలో గురువారం ట్రాక్టర్ బోల్తా పడి పలువురు కూలీలకు గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. గాంధారికి చెందిన పలువురు కూలీలు పనికి వెళ్లి తిరిగి వస్తుండగా గాంధారి –నేరల్ రహదారిలో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు కింద పడిపోయింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న ఐదుగురు కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పశువుల కొట్టం దగ్ధం

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాసముందర్‌లో గురువారం పశువుల కొట్టం కాలిపోయింది. గ్రామానికి చెందిన రైతు కట్ట రాజన్నకు చెందిన పశువుల కొట్టానికి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు రాజన్నకు, అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో ఫైర్ ఇంజిన్ ఘటన స్థలానికి చేరుకోని మంటలను ఆర్పివేసింది. ప్రమాదంలో వ్యవసాయ పరికరాలతో పాటు, పశువుల గడ్డి, ద్విచక్ర వాహనం, రెండు సైకిళ్లు, బోరు మోటారు పంపుసెట్టు, గృహానికి అవసరమైన కొత్త తలుపులు పూర్తిగా కాలిపోయాయి. రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

నాలుగు కార్లు దగ్ధం..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆటోనగర్‌లో సయ్యద్ ఖలీంకు చెందిన హర్‌మాన్ మోటర్ కార్ మెకానిక్ షెడ్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నాలుగు కార్లు, ఇతర సామగ్రి కాలిపోయాయి. ఘటన స్థలాన్ని ఎస్సై సాయికుమార్‌గౌడ్ పరిశీలించారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

ఎడపల్లి: ఎడపల్లికి చెందిన ద్రౌపతి లక్ష్మి (55) గురువారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. లక్ష్మి కుటుంబంలో తరచూ గొడవలు పడేదని గురువారం సైతం ఇంట్లో గొడవపడి ఇంటి వెనకాల ఉన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారని ఆమె భర్త గంగాధర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాండేరావు తెలిపారు.

మద్యం మత్తులో కింద పడి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని లక్ష్మీప్రియనగర్‌లో మద్యం తాగి ఇంట్లో పడి ప్రసాద్(42) మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలు.. బుధవారం ఓ అంత్యక్రియల్లో పాల్గొని వచ్చిన ప్రసాద్ మద్యం తాగి ఇంట్లో కిందపడిపోవడంతో తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రసాద్ మృతి చెందాడు. తల్లిగారింటికి వెళ్లిన భార్య తిరిగి రావడంతో ప్రసాద్ మృతిచెందిన విషయం తెలిసింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్‌లో దొంగతనం కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. వివరాలు.. ఈ నెల 12న మధ్యాహ్నం సుంకరి శ్రీధర్ కుమార్ ఇంట్లో చోరీ జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నగరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన చెట్టిపల్లి భాస్కర్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.12 వేల నగదు రికవరీ చేశారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం చక్రధర్‌నగర్ తండాకు చెందిన ఓ తల్లి తన ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. తండాకు చెందిన దిగవత్ సురేష్ భార్య భారతి, కూతురు భార్గవి, కుమారుడు మనోజ్‌తో ఈ నెలా 10న బయటకు వెళ్లిపోయింది. సురేష్, కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చోరీకి వచ్చి హత్యాయత్నం



గాయపడిన మహబూబ్‌ఖాన్

ఖలీల్‌వాడి: నగరంలోని ఆటోనగర్‌లో ఓ ఇంట్లో చోరీకి వచ్చిన దుండగులు ఆ ఇంటి యజమానిపై హత్యాయత్నం చేశారు. వివరాలు.. ఆటోనగర్‌లోని గౌసియ మసిదు ప్రాంతంలో మహబూబ్ ఖాన్ కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. మహబూబ్ ఖాన్ ఇంట్లో ఆయన అల్లుడు మహ్మద్ ఖలీం తన భార్య పిల్లలతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. ఖలీం భార్య హబీబా, అత్తమ్మ సఫియా బేగం ఇతర కుటుంబ సభ్యులు పది రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. ఖలీం, మహబూబ్ ఖాన్ వారి ఇళ్లలో ఉన్నారు. గురువారం ఉదయం హబీబా, సఫియా బేగం తిరిగి వచ్చే సరికి మెయిన్ డోర్ తాళం పగులగొట్టి ఉంది. పక్క రూమ్‌లో మహబూబ్‌ఖాన్ గాయాలతో పడి ఉన్నాడు. ఇంకో గదిలోని బీరువాలో ఉంచిన నగదు ఎత్తుకెళ్లారు. మహబూబ్‌ఖాన్‌పై పదునైన ఆయుధంతో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. రక్తపు మడుగులో ఉన్న మహబూబ్ ఖాన్‌ను కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆరో టౌన్ ఎస్సై సాయి కుమార్‌గౌడ్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో తీగల లింబాగౌడ్ ఇంట్లో పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. సిద్దిపేటలో లింబాగౌడ్ బంధువులు చనిపోవడంతో కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి తొమ్మిది రోజుల క్రితం అక్కడికి వెళ్లారు. మూడు రోజుల క్రితం లింబాగౌడ్ కుమారుడు సుచరిత్‌గౌడ్ ఇంటికి వచ్చాడు. గురువారం మధ్యాహ్నం ఆయన ఇంటికి తాళం వేసి స్నేహితుల దగ్గరికి వెళ్లి వచ్చే సరికి చోరీ జరిగింది. బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారం, రూ.25 నగదు ఎత్తుకెళ్లినట్లు సుచరిత్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దేవాయిపల్లిలో రోటవేటర్..

తాడ్వాయి: మండలంలోని దేవాయిపల్లికి చెందిన జైపాల్‌రెడ్డి రోటవేటర్ చోరీ అయినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. జైపాల్‌రెడ్డి బ్రాహ్మణపల్లి గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న తన పొలం వద్ద ట్రాక్టర్, కల్టివేటర్, రోటవేటర్ తదతర పనిముట్లను ఉంచాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లి చూడగా రోటవేటర్ కనిపించలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.